సాక్షి
వికారాబాద్

సోమవారం । 6 । మార్చి । 2023



నత్తనడకన మనబడి
పాఠశాలల అభివృద్ధి కోసం చేపడుతున్న మన ఊరు– మన బడి పనులు నత్తనడకన సాగుతున్నాయి. 8లో▸



రేపు గిరి ప్రదక్షిణ
బండవెల్కిచర్లలో ఉన్న పాంబండ దేవస్థానంలో ఈ నెల 7న గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 8లో▸



శంకుస్థాపనతోనే సరా!
అట్టహాసంగా శంకుస్థాపన చేసి ఏడాది కావస్తున్నా.. అంబేడ్కర్ భవన నిర్మాణ పనుల్లో పురోగతి కానరావడంలేదు. 9లో▸

న్యూస్‌రీల్

సీఓఈ ప్రవేశ పరీక్ష ప్రశాంతం



వికారాబాద్ కొత్తగడి సెంటర్ వద్ద విద్యార్థుల సందడి

అనంతగిరి: టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ గురుకుల పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ) ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఇంటర్ అర్హత పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా 9 సెంటర్లలో 544 మందికి గాను 515 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల ఇన్‌చార్జి తెలిపారు. డిగ్రీ అర్హత పరీక్ష మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5వరకు జిల్లా వ్యాప్తంగా రెండు సెంటర్లలో జరిగింది. 393 విద్యార్థులకు గాను 358మంది హాజరయ్యారు.

'మొలక మాస' కృషి అభినందనీయం



మొలక మాసపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి

అనంతగిరి: పాఠశాల విద్యార్థి దశ నుంచే సాహిత్య కళను చిగురింపజేస్తున్న మొలక మాస పత్రిక కృషి ప్రశంసనీయమని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని మార్చి నెల మాస పత్రికను ఆమె ఆవిష్కరించారు. ఈ మాస పత్రికలో వికారాబాద్ సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాల విద్యార్థుల రచనలు ఎంతో బాగున్నాయని అభినందించారు. కార్యక్రమంలో మొలక మాసపత్రిక సంపాదకులు వేదాంతసూరి, విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, మణిపూసల సృష్టికర్త గడిచర్ల సత్యం, ప్రిన్సిపాల్ రమణమ్మ, స్కూల్ కమిటీ చైర్మన్ గోపాల్, కోశాధికారి రత్నం, మొలక ప్రతినిధి వెంకటేష్, తెలుగు పండితులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గుండెపోటు.. ప్రాణం కాపాడిన పోలీసు

తాండూరు: గుండె పోటుతో కుప్పకూలిన వ్యక్తికి హెడ్ కానిస్టేబుల్ సీపీఆర్ విధానంతో ఊపిరి పోశారు. పట్టణంలోని హుండేకర్ నాగేశ్ అనే వ్యక్తి ఆదివారం భార్యపిల్లలతో కలిసి ఇంట్లోనే ఉన్నాడు. సాయంత్రం వేళ ఒక్కసారిగా గుండె పోటుకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆర్తనాదాలు చేశారు. అతని ఇంటి పక్కనే ఉన్న పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ వెంటనే స్పందించి సీపీఆర్ ద్వారా గుండెకు గాలి అందేలా చేశారు. గుండె కొట్టుకోవడం ప్రారంభించిన వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రాణాలు కాపాడిన హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణను స్థానికులు అభినందించారు.

రియల్ ఎస్టేట్ రంగంలో అపార అవకాశాలు

మొయినాబాద్: రియల్ ఎస్టేట్ రంగంలో యువతకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ప్రముఖ లైఫ్ కోచ్, రియల్ ఎస్టేట్ ట్రైనింగ్ నాచురోపతి ప్రాక్టీషనర్ డాక్టర్ శివకుమార్ అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ రెవెన్యూలో ఉన్న మీమాంస వెల్‌నెస్ రిసార్ట్స్‌లో ఆదివారం సుమారు రెండు వేల మందికి రియల్ ఎస్టేట్ మార్కెటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయం రంగం తరువాత అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్న రంగం రియల్ ఎస్టేట్ అన్నారు. దేశ అభివృద్ధికి రియల్ ఎస్టేట్ రంగం ఎంతో దోహదం చేస్తుందన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో ప్రొఫెషనల్‌గా డీల్ చేస్తే సుదీర్ఘ కాలం నిలదొక్కుకోవచ్చన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
టీవీవీ రాష్ట్ర కోశాధికారి టీజీ శ్రీనివాస్

షాద్‌నగర్: ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కోశాధికారి టీజీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును ఈనెల 12న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. టీజీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం ఎంతోమంది పోరాటం చేశారన్నారు.



రంగులు చల్లుకుంటూ సంబురాలు

రంగు ఎగిసె.. మనసు మురిసె

ఘనంగా హోలీ, ఉమెన్స్ డే సంబరాలు

వికారాబాద్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హోలీ, ఉమెన్స్‌డే సంబరాలు అంబరాన్నంటాయి. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలు నిర్వహించారు. మొదట కేక్ కట్‌చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం హోలీ రంగుల్లో మునిగితేలారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. సమస్య ఏదైనా ధైర్యంగా ఎదుర్కోవాలని ఆమె సూచించారు. – అనంతగిరి

ధర.. దగా

దళారులు చెప్పిందే ధర.. వ్యాపారులు వేసిందే.. తూకం.. అన్న చందంగా మారింది మార్కెట్ వ్యవస్థ. జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లలో దళారులు, వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తాము చెప్పిందే ధర అన్నట్టుగా మార్కెట్ రేట్లను శాసిస్తున్నారు. ప్రస్తుతం వేరుశనగ పంట ఉత్పత్తులు విరివిగా వస్తున్నాయి. ఇదే అదనుగా దళారులు నిలువుదోపిడీకి పాల్పడుతున్నారు. నష్టపోతున్న రైతులు రోడ్డెక్కుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. – వికారాబాద్

దళారులు చెప్పిందే రేటు
- మార్కెట్లో తిష్టవేసిన అక్రమార్కులు
- వేరుశనగ పంట ఉత్పత్తుల రాకతో ఆగడాలు రెట్టింపు
- ఒక్క రోజులోనే రూ.3వేలు తగ్గింపు
- అయోమయంలో రైతులు
- పట్టించుకోని వ్యవసాయ మార్కెట్ అధికారులు



వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ బస్తాలు

రైతుల రెక్కల కష్టం దళారులపరం అవుతోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను వ్యాపారులు, దళారులు కుమ్మక్కై దోచుకుంటున్నారు. వారు చెప్పిందే ధర అంటూ శాసిస్తున్నారు. ఒక్కో మార్కెట్‌లో ఒకరిద్దరు గుత్తాధిపత్యం చేస్తున్నారు. ఇక్కడ తిష్టవేసిన ఒకరిద్దరు వ్యాపారులు ధరలు నిర్ణయిస్తున్నారు. రైతు ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోవడంలేదు. దళారులు మోసం చేస్తున్నారని రైతన్నలు రోడ్డెక్కినా.. ఫిర్యాదులు చేసినా అధికారుల్లో స్పందన కానరావడంలేదు. మరో వైపు అక్రమంగా నిర్వహించే వారి చిల్లర వ్యాపారం లీగల్‌గా నడిచే వ్యవసాయ మార్కెట్ అమ్మకాలనే డామినేట్ చేస్తుండటం గమనార్హం. జిల్లాలో 30 వేల ఎకరాల్లో వేరుశనగ పంట రైతులు సాగు చేయగా ప్రస్తుతం ఆ పంట చేతికి వచ్చింది. జిల్లా పరిధిలోని పరిగి, కొడంగల్, ధారూరు, మర్పల్లి, తాండూరు, బషీరాబాద్, కుల్కచర్ల తదితర మార్కెట్లలో రెండు వారాలుగా ఉత్పత్తులు పోటెత్తుతున్నాయి. వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలను నిర్ణయిస్తూ రైతులను నిండా ముంచుతున్నారు.

రెచ్చిపోతున్న చిల్లర వ్యాపారులు..

మార్కెట్లకు పంట ఉత్పత్తులు విరివిగా వస్తుండటంతో చిల్లర వ్యాపారులు రెచ్చిపోతున్నారు. మరోవైపు వ్యవసాయ మార్కెట్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో చిల్లర వ్యాపారులకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. వారిది చిల్లర వ్యాపారమే అయినా రూ.కోట్లలో లావాదేవీలు నిర్వహిస్తుండటం గమనార్హం. తూకాల్లో కనికట్టు ప్రదర్శిస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారు. వారు సమాంతర మార్కెట్‌లు నిర్వహిస్తూ ప్రతి వారం వేల క్వింటాళ్ల పంటను రైతుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో చిల్లర వ్యాపారి ఎలాంటి లైసెన్స్ లేకుండానే వందల క్వింటాళ్ల పంట కొనుగోలు చేస్తున్నారంటే వారు ఎలా విజృంభిస్తున్నారో అర్థమవుతోంది. బహిరంగంగా అక్రమ వ్యాపారం చేస్తున్నా.. ఆదాయానికి గండికొడుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారిచ్చే మామూళ్లే ఇందుకు కారణమని పలువురు మండిపడుతున్నారు.

సిండికేట్ దందా..

వ్యవసాయ మార్కెట్లలో కొనుగోలుదారులందరూ కలిసి సిండికేట్ దందా నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం స్పందించడం లేదు. గతంలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో అధికారులు తూతూ మంత్రంగా విచారణ నిర్వహించారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అధికారులు సైతం అడ్తిదారులకు, కొనుగోలు దారులకు కొమ్ముకాస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమాలపై ఆగ్రహించిన రైతులు శనివారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తక్కువ ధరకే ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. గత శుక్ర, శనివారాల్లో పరిగిలో నిర్వహించిన అడ్తీల్లో ఒక్క రోజులోనే వేరుశనగ ధర రూ. 3000 తగ్గించారు. శుక్రవారం ఉదయం వరకు క్వింటాలుకు రూ. 7,500 వరకు ఉన్న వేరుశనగ ధర శనివారం నాటికి రూ. 5000 కు తగ్గించారు. దీంతో రైతులు రోడ్డెక్కారు. మరో వైపు రాత్రిళ్ల తూకాలు వేస్తూ మోసం చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులను సైతం రానివ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



అనంతగిరి అడవిలో జంతువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టి

వన్యప్రాణులకు నీరేది?

- దాహంతో అల్లాడుతున్న జంతువులు
- రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన జింకలు
- నామమాత్రంగా నీటి కులాయిలు
- ఎవరికీ పట్టని మూగగోస



ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జింక

వికారాబాద్ అర్బన్: పదిహేను రోజులుగా ఎండల తీవ్రత పెరుగుతోంది. అనంతగిరి అడవిలోని 90 శాతం చెట్లు ఆకులను రాల్చడంతో అటవీ జంతువులకు నీడ కరువైంది. దీనికి తోడు దాహం తీర్చుకోవడం వాటికి గండంగా మారింది. అడవిలోని వన్యప్రాణులు నీటి కోసం అల్లాడుతున్నాయి. నీటి జాడను పసిగట్టి దాహం తీర్చుకునేందుకు రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడటం పరిపాటిగా మారింది. ప్రతి ఏటా వేసవిలో ఐదు.. ఆరు జింకలు నీటి కోసం రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. వన్యప్రాణుల రక్షణ కోసం ప్రత్యేక కార్యాచరణ చేపడతామని చెబుతున్న అటవీశాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు. శ్రీశైలం తరహాలో జింకలు, ఇతర అడవి జంతువుల నివాసానికి అనంతగిరి అడవులు ఎంతో అనువైనవని గుర్తించిన అధికారులు 2012లో పది జింకలను వదిలారు. ఈ 11 సంవత్సరాల్లో ఆ జింకల సంఖ్య ఘననీయంగా పెరిగింది. కానీ వాటికి రక్షణ కల్పించడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వేసవి తీవ్రం కావడంతో జంతువుల దాహం తీర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోకుంటే మరిన్ని జంతువులు మృత్యువాత పడే అవకాశం ఉంది.

ప్రమాదాల బారిన జింకలు

వేసవి కాలం ప్రారంభం కాగానే జింకలు తరచూ మృత్యువాత పడుతున్నాయి. దాహం తీర్చుకునేందుకు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతాలకు వెళ్తున్న క్రమంలో రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురవుతాయి. ఈ ప్రమాదాలు బండ బావి నుంచి జింక సర్కిల్ వరకు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని గతంలో అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతంలో జంతువులు రోడ్డుపైకి రాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అయినా ప్రమాదాలు తగ్గడం లేదు.

కానరాని నీటి జాడ..

అనంతగిరి అడవుల్లో జంతువులకు నీటి జాడ కానరావడం లేదు. రెండు దశాబ్దాల క్రితం అనంతగిరి అడవుల్లోని పలు ప్రాంతాల్లో నీరు పుష్కలంగా ఉండేది. కొలింగ లొద్ది, దేవుని పాదాలు, పుష్కరిణి, విశ్వాసం లొద్ది (అలియాస్ లక్ష్మీతీర్థం) ప్రాంతాల్లో నీరు సంవత్సరంలో నాలుగు కాలాలు ఉండేవని స్థానికులు చెబుతున్నారు. అనంతగిరి అడవిలోని జంతువులు ఇక్కడ దాహం తీర్చుకునేవి. కొంత కాలంగా పుష్కరిణి మినహా మిగతా మూడు ప్రాంతాల్లో నీరు ఏమాత్రం ఉండటం లేదు. పుష్కరిణిలో నీరు ఉన్నా దేవాదాయ శాఖ వారు చుట్టూ జాలి వేయడంతో జంతువులు నీరు తాగే అవకాశం లేకుండా పోయింది. టీబీ ఆస్పత్రి వద్ద అక్కడక్కడా కులాయిలు ఉన్నాయి. వాటిలో ఉన్న నీరును తాగేందుకు వస్తే అక్కడ ఉన్న కుక్కలు జింకలను వేటాడుతున్నాయి.

నీటి తొట్లు ఉన్నా..

అటవీశాఖ అధికారులు గతంలో పలు చోట్ల నీటి తొట్లు ఏర్పాటు చేశారు. కానీ వాటిలో ఈ ఏడాది ఇంకా నీరు పోయడం ప్రారంభించలేదు. దీంతో జంతువులు, ఇతర పక్షులు దాహం తీర్చుకోవడం కష్టంగా మారింది. వేసవి ప్రారంభం కావడంతో ఆ కులాయిల్లో నీరు ఉంచితే జంతువుల దాహం తీర్చడంతో పాటు, ప్రమాదాల నుంచి రక్షించవచ్చని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఈ విషయంపై స్థానిక అటవీశాఖ రేంజ్ ఆఫీసర్‌ను ఫోన్ ద్వారా సమాచారం అడిగే ప్రయత్నం చేయగా స్పందించలేదు.

వైభవంగా గిరిజన జాతర

- భక్తిశ్రద్ధలతో తండావాసుల ప్రత్యేక పూజలు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు

బషీరాబాద్: మండల పరిధిలోని వాల్యానాయక్ తండాలో ఆదివారం గిరిజన జాతర వైభవంగా ప్రారంభమైంది. తండాలోని సేవాలాల్ మహరాజ్, భవానీ మాతకు గిరిజన మహిళలు బోనాలతో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తండాలోని ప్రతి ఒక్కరూ ఎక్కడ ఉన్నా ఈ జాతరకు తరలివస్తారని స్థానికులు తెలిపారు. అలాగే మహరాజ్ పల్లకీ సేవను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తండాలోని వీధివీధినా భజనలు చేస్తూ ఊరేగించారు. జాతర సందర్భంగా ఇంటింటా సందడి నెలకొంది. ఈ జాతర సోమవారం ముగుస్తుంది. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామునాయక్, సర్పంచ్ శివనాయక్ తండా పెద్దలు పాల్గొన్నారు.



సేవాలాల్ ఆలయం ఎదుట గిరిజన మహిళలు



ఎరన్‌పల్లి శివారులో నరికివేతకు గురైన చెట్లు



జేసీబీతో మట్టిని తవ్వుతూ..

ఇటు నరికేస్తుండ్రు.. అటు తవ్వేస్తుండ్రు

- అక్రమార్కుల ఇష్టారాజ్యం
- చోద్యంచూస్తున్న అధికారగణం

కొడంగల్: మండల పరిధిలోని ఎరన్‌పల్లి శివారులో ఇష్టారాజ్యంగా భారీ వృక్షాలను నరికివేస్తున్నారు. మరోవైపు ఎర్రమట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కొడంగల్ సమీపంలో జాతీయ రహదారిపై కొందరు వ్యక్తులు కొత్తగా వెంచర్లు చేశారు. వెంచర్లలో రోడ్లు ఇతర అవసరాల కోసం ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతి లేకుండా మట్టిని తీసుకెళ్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. వాస్తవానికి మట్టిని తరలించాలంటే రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరి. కొడంగల్‌కు చెందిన వాహనాలతో మట్టిని తరలిస్తే అనుమానం వస్తుందని భావించి కోస్గి పట్టణానికి చెందిన రెండు జేసీబీలు, ఆరు టిప్పర్లతో తరలిస్తున్నారు. ఈ క్రమంలో దారిపొడవునా ఉన్న చెట్లను కూడా నరికి దర్జాగా మట్టిని తరలిస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై తహశీల్దార్ బుచ్చయ్యను వివరణ కోరగా తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

ప్రజా సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

- వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధిచెప్పాలి
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరుకుల ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డివిరుస్తున్నాయని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మండిపడ్డారు. మహమ్మదాబాద్ మండలం జూలపల్లిలో ఇంటింటికీ తిరిగి హాత్‌సే హాత్ జోడో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అలాగే ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను ఎలా దోచుకుతింటున్నాయో తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేసేది కేవలం కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అని అన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, ఇక్కడ రాష్ట్రంలోని ప్రభుత్వాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎలాంటి అభివృద్ధి పనులు చేపడుతున్నదీ.. ఎలాంటి పథకాలు తీసుకువస్తుందనేది ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జోడో కార్యక్రమంలో రామ్మోహన్‌రెడ్డి తదితరులు

క్లుప్తంగా

కానిస్టేబుల్ హత్యాయత్నం కేసులో ముగ్గురి రిమాండ్

తాండూరు టౌన్: కానిస్టేబుల్ హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. తాండూరుకు చెందిన బాతుల శ్రీను ఆయన కుమారులు శ్రీకాంత్, శ్రీధర్‌లు గతేడాది డిసెంబర్ 16న కానిస్టేబుల్ రాఘవేందర్‌పై దాడి చేసి హత్యాయత్నం చేశారు. ఈ విషయంలో ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. దాడి చేసిన దృశ్యాలు చింతామణిపట్నంకు చెందిన సురేందర్‌రెడ్డి సీసీ కెమెరాలో నమోదు కావడంతో నిందితులు అతని కారు షెడ్డుకు నిప్పంటించారు. దీంతో ఆ ముగ్గురిపై మరో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులు రెండున్నర నెలలుగా పరారీలో ఉన్నారని, శనివారం కొడంగల్ కోర్టు మెజిస్ట్రేట్ సమక్షంలో లొంగిపోయారన్నారు. దీంతో మెజిస్ట్రేట్ వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్



మాట్లాడుతున్న ప్రదీప్

పరిగి: ప్రజా సమస్యలపై సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నిరంతరం పోరాడుతుందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సూచించారు. ఆదివారం పట్టణ కేంద్రంలో పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గరాన్ని ఎన్నుకున్నారు. పరిగి డివిజన్ కార్యదర్శిగా మల్లేశ్‌ను నియమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాయకులు నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలపై పోరాడాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎంతో మంది ప్రజలు ప్రభుత్వ పథకాలను దూరంగా ఉండి అన్యాయానికి గురవుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యూనిస్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్, జిల్లా సెక్రటరీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ చైర్‌పర్సన్ కార్యక్రమంలో మార్పు

ఇక నుంచి ప్రతీ గురువారం

వికారాబాద్ అర్బన్: ప్రతీ సోమవారం నిర్వహించే డయల్ యువర్ చైర్‌పర్సన్ కార్యక్రమాన్ని గురువారానికి మారుస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం మేరకు అన్ని మున్సిపాలిటీలో ప్రతీ సోమవారం కమీషనర్లు నిర్వహిస్తున్నందున తమ కార్యక్రమాన్ని గురువారానికి మార్చినట్లు తెలిపారు. ఈ నెల 9న ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు డయల్ యువర్ చైర్‌పర్సన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మత్స్యకారుల సంతకాల సేకరణ

మంచాల: ఏప్రిల్ 3న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాకు మద్దతుగా మండల పరిధిలోని జాపాలలో ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఆ సంఘం రాష్ట్ర నాయకుడు నర్సింహ మాట్లాడుతూ.. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి వచ్చేనెల ఢిల్లీలో దేశ వ్యాప్తంగా ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఢిల్లీలో జరిగే ఈ కార్యక్రమంలో మత్స్య కార్మికులు పెద్ద పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నత్తనడకన 'మన బడి'

- అవగాహన లేమితో పనులు ఆలస్యం
- టెండర్లకు నోచుకోని ఆరు పాఠశాలలు



అసంపూర్తిగా కుస్మసముద్రం పాఠశాల భవన మరమ్మతులు



ఘనాపూర్ పాఠశాలలో కూలిన ప్రహరీ

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సర్కార్ మనఊరు–మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పనులు ప్రారంభించినా క్షేత్ర స్థాయిలో నత్తనడకన కొనసాగుతున్నాయి. గతేడాది జూలైలో ప్రారంభమైన పనులు ఈ మార్చి నెలాఖరుకు పూర్తవడం కష్టమేనని పలువురు చర్చించుకుంటున్నారు.

కుల్కచర్ల: పాఠశాలల అభివృద్ధి కోసం ప్రారంభించిన పథకాన్ని ప్రజాప్రతినిధులు అట్టహాసంగా ప్రారంభించినప్పటికీ ఆది నుంచి ఇబ్బందుల నడుమే పనులు కొనసాగుతున్నాయి. కుల్కచర్ల మండల పరిధిలో 26, చౌడాపూర్ మండల పరిధిలో 16 పాఠశాలలు మనఊరు మనబడి పనులకు అధికారులు ఎంపిక చేశారు. కాగా ఆరు పాఠశాలల్లో రూ.40లక్షల పనులు నిర్వహించాల్సి ఉండగా నేటికీ టెండర్ల ప్రక్రియ పూర్తవ్వలేదు. దీంతో ఆ పాఠశాలల్లో నేటికీ పనులు ప్రారంభించ లేదు. కులకచర్లలో 23, చౌడాపూర్‌లో 13 పాఠశాలలలో పనులు ప్రారంభమైనా నత్తనడకన కొనసాగుతున్నాయి.

ఇరిగేషన్ శాఖకు భవన నిర్మాణాలు

పాఠశాలలలో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు ఒక్కో శాఖకు ఒక్కో మండల విధులను అప్పగించారు. కాగా కుల్కచర్ల, చౌడాపూర్ మండలాలలో ఇరిగేషన్ శాఖకు విధులు అప్పగించారు. ఇరిగేషన్ అధికారులకు భవనాల నిర్మాణం పనులపై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో క్షేత్రస్థాయిలో పనులు చురుగ్గా కొనసాగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంబీ రికార్డుల్లో బిల్లులు నమోదుపై అధికారులకు అవగాహన లేకపోవడంతో కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందడం లేదు. నిధుల కేటాయింపు గురించి వీరికి సరైన అవగాహన లేకపోవడంతో ఈ పనులు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్నట్టుగా సాగుతున్నాయి.

నెలాఖరుకు పనులు పూర్తయ్యేనా..?

మార్చి నెలాఖరుకు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేస్తూ అందుకు అనుగుణంగా అధికారులకు సూచనలు చేస్తున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం పనుల నిర్వాహణ కొనసాగడం లేదు. కులకచర్ల మండల పరిధిలో 23 పాఠశాలల్లో పనులు కొనసాగుతుండగా కేవలం పది పాఠశాలల్లో మాత్రమే 50శాతం పైగా పనులు పూర్తయ్యాయి. మిగిలిన 13 పాఠశాలల్లో ఇంకా పనులు పుంజుకోలేదు.



కుస్మసముద్రం పాఠశాలలో మరుగుదొడ్ల దుస్థితి

అధికారులు సహకరించడం లేదు



పనుల నిర్వాహణలో అధికారులు పూర్తిస్థాయిలో సహకరించడంలేదు. అభివృద్ధి పనుల నిర్మాణానికి ఎస్టిమేషన్ వేయాలని, బిల్లులు త్వరగా వచ్చేలా చూడాలని అధికారులను కోరితే.. మాకు ఇరిగేషన్ శాఖకు సంబంధించిన పనులున్నాయి చూడాలి. వీటికి సమయం పడుతుందని సమాధానం ఇస్తున్నారు. బిల్లుల మంజూరులోనూ ఇబ్బందులు తప్పడం లేదు.

– శ్రీరామ్, ఎస్ఎంసీ చైర్మన్, ఘనపూర్ పాఠశాల

పర్యవేక్షణ చేస్తున్నాం



కుల్కచర్ల, చౌడాపూర్ మండలాలలో మన ఊరు మనబడి పనుల నిర్వహణను వేగవంతం చేసేందుకు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, నిర్వాహకులకు ఎప్పటికప్పుడు నిధుల మంజూరు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ పనులు పూర్తి చేసేందుకు సూచనలు చేస్తున్నాం.

– హబీబ్ అహ్మద్, ఎంఈఓ, కుల్కచర్ల

రేపు రంగుల హంగామా

- రోహితన్న యువసేన ఆధ్వర్యంలో హోలీ సంబురాలు
- ఉట్టికొట్టిన జట్టుకు రూ.50వేల నగదు బహుమతి
- డ్రోన్ కెమెరాతో వేడుకల చిత్రీకరణ

తాండూరు టౌన్: రంగుల హంగామాకు మంగళవారం తాండూరు పట్టణం వేదికకానుంది. హోలీ సందర్భంగా ఈ ఏడాది రోహితన్న యువసేన ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పట్టణంలోని భద్రప్ప ఆలయం వద్ద నిర్వహించనున్న ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ వేడుకల్లో ప్రధాన ఘట్టం ఉట్టి కొట్టే కార్యక్రమం. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన జట్లు గ్రామాల వారీగా పాల్గొననున్నారు. తక్కువ సమయంలో ఉట్టి కొట్టిన జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.50వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25వేల నగదు పురస్కారం అందజేయనున్నారు. ఆసక్తి ఉన్న జట్లు మండలాల వారీగా రోహితన్న యువసేన సభ్యులకు ఫోన్ ద్వారా తమ జట్టు పేరును రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ వేడుకల్లో డీజే సౌండ్స్, హోలీ ప్రత్యేక గీతాలతో యువత కేరింతలు కొట్టనున్నారు. 50 వరకు కలర్ గన్స్, రంగుల పొగలు వచ్చేలా ఆరు కలర్ క్లౌడ్ గాడ్జెట్స్‌తో పాటు కలర్స్‌తో రెయిన్ డ్యాన్స్ ఏర్పాటు చేసి ఉర్రూతలూగించనున్నారు. ఈ సంబురాలను డ్రోన్ కెమెరాతో ప్రత్యేకంగా చిత్రీకరించనున్నారు. ఉట్టి కొట్టే పోటీలో పాల్గొనే యువ జట్లు నియోజకవర్గం వారీగా 9392395681 ఫోన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. తాండూరు టౌన్ 8978646718, బషీరాబాద్ మండలం 9948115020,యాలాలమండలం 9059018708, పెద్దేముల్ మండలం 7780692125 ఫోన్ నెంబర్లకు కాల్ చేసి తమ జట్ల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. హోలీ ప్రజలంతా ఆహ్లాదంగా జరుపుకోవాలనే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు రోహితన్న యువసేన సభ్యులు తెలిపారు.

'భగీరథ'.. ఇదేం వ్యథ!

- నల్లాల నుంచి కలుషిత నీరు సరఫరా
- చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్



వడిచర్లలో నల్లా నుంచి వస్తున్న కలుషిత నీరు

బొంరాస్‌పేట: ప్రభుత్వం ప్రతీ ఒక్కరు సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో మిషన్ భగీరథ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కానీ పలు గ్రామాల్లో కలుషిత నీరు సరఫరా అవ్వడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధిలోని వడిచర్లలో నాలుగు రోజులుగా నల్లాల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోంది. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయమై సర్పంచ్ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శి సువర్ణకు చెప్పినా పట్టించుకోవడం లేదని ముదిరాజ్ సంఘం నాయకుడు వెంకటేశ్, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి సువర్ణను వివరణ కోరగా నిత్యం గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. భగీరథ నీరు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. సోమవారం సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

సకాలంలో పనులు పూర్తి చేయండి



సమీకృత మార్కెట్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

వికారాబాద్ అర్బన్: సమీకృత మార్కెట్ పనులను సకాలంలో పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆదివారం ఆయన రైతు బజారు సమీపంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణంలో నాణ్యత తప్పక పాటించాలన్నారు. సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తైతే వినియోగదారులకు వెజ్, నాన్ వెజ్, పూలు, పండ్లు వంటివి ఒకేచోట లభిస్తాయన్నారు. పార్కింగ్‌కు అనువుగా స్థలాన్ని వదిలేయాలని సూచించారు. బీఫ్ షాపులు యజమానుల సమస్యను ఎమ్మెల్యేకు వివరించగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

జింక సర్కిల్ 'కళ' తప్పింది

వికారాబాద్ అర్బన్: అనంతగిరి వచ్చే పర్యాటకులకు జింక సర్కిల్ ఎంతో ఆహ్లాదాన్ని కలిగించేది. సర్కిల్ చుట్టూ పూల మొక్కలు, పచ్చిక బయళ్లతో పచ్చదనం ఉట్టిపడేది. కానీ కొంత కాలంగా ఈ సర్కిల్ కళావిహీనంగా మారింది. అనంతగిరి దేవస్థానం, హరిత రిసార్ట్స్‌కు వెళ్లే వారికి ఇది స్వాగత తోరణంగా ఆహ్వానం పలికేది. ఇక్కడి వచ్చే సందర్శకులు తప్పని సరిగా ఈ సర్కిల్ వద్ద ఫొటోలు దిగి మురిసిపోయే వారు. కానీ సర్కిల్ కళ తప్పడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు.



భక్తుల కొంగు బంగారం.. మైలారం వేంకటేశ్వర స్వామి

- నేటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు
- ముస్తాబైన ఆలయం



ఆలయంలో కొలువుదీరిన స్వామి వారు

దోమ: మండల పరిధిలోని మైలారం గ్రామంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయం భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. భక్తితో కొలిచిన వారికి కొండంత అండగా.. కోరిన కోర్కెల తీర్చే భక్తుల కొంగు బంగారంగా పేరుగాంచిన ఈ ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు కొనసాగనున్నాయి. రాతి కట్టడం, ఆలయ లోపలి భాగంలో పాలరాతిని వినియోగించడం ఆలయ విశిష్టతకు నిదర్శనం. గుట్టపై సువిశాలమైన ప్రదేశంలో ఆహ్లాదకర వాతావరణం ఈ ఆలయం వెలియడంతో భక్తులు ఏటేటా పెరుగుతున్నారు.

వైభవోపేతంగా బ్రహ్మోత్సవాలు

మైలారం గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు సోమవారం పుణ్యాహవాచనం, రక్షాబంధన్, వాస్తుపూజ, హోమం, అంకురార్పణ నిర్వహిస్తారు. రెండవ రోజున మంగళవారం ధ్వజరోహణ, అగ్నిప్రతిష్ట హోమం, విష్ణుసహస్రనామ పారాయణం, ఊంజల్ సేవలు ఉంటాయి. బుధవారం సుప్రభాతం, సహస్రనామార్చన, విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. గురువారం మహాపూర్ణాహుతి, స్వామి వారి కల్యాణోత్సవం, పల్లకీ సేవ, ధ్వజ అవరోహణం, పుష్పయాగాలతో ఉత్సవాలు ముగియనున్నాయి.

ప్రత్యేక ఏర్పాట్లు

స్వామి వారి బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆలయ నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు తాగునీటికి, తలనీలాలు సమర్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధం చేశారు.

ఆరాధ్యదైవం



మైలారంలో వెలసిన వేంకటేశ్వర స్వామి భక్తులకు కోర్కెలు తీర్చే ఆరాధ్యదైవంగా నిలుస్తున్నారు. నిత్యం ఈ ఆలయానికి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు.

– సురేందర్, మైలారం

ఏర్పాట్లు పూర్తి



బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రతీ ఏడాది ఈ ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తున్నాం. వేసవి దృష్ట్యా భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. షెడ్‌లు, తాగునీటి వసతి, తలనీలాలకు ప్రత్యేక షెడ్‌లు ఏర్పాటు చేశాం.

– రాములు నాయక్, ఆలయ నిర్మాణ కర్త, మైలారం

పాలకులతోనే నిరుద్యోగ సమస్య

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

మీర్‌పేట: పాలకుల విధానాల వల్లే దేశంలోని యువత ఉద్యోగాలు లేక నిరాశ నిస్పృహలో ఉన్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రాచారి అన్నారు. ఆదివారం లెనిన్ నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జరిగిన అఖిల భారత యువజన సమైక్య మండల స్థాయి సమావేశానికి రవీంద్రాచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేయడంతో పాటు కనీసం ఖాళీ పోస్టులను కూడా భర్తీ చేయలేదని ఆరోపించారు. ఉచిత విద్య, వైద్యం, ఉపాధి కోసం యువత పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. యువజన సమైక్య జిల్లా అధ్యక్షుడు పోలోజు లక్ష్మణాచారి మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, కుల, మత రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ బాలాపూర్ మండల కార్యదర్శి అయోధ్య వెంకటరమణారెడ్డి, నాయకులు డి శేఖర్, నరేందర్, రాజు, రాజేష్, రాజశేఖర్, అఖిల్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీకి యత్నం

నందిగామ: మండల కేంద్రమైన నందిగామ శివరామంజనేయ స్వామి ఆలయంలో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. హుండీని ధ్వంసం చేసి ఆలయ వెలుపల పడేశారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామంలోని శివరామంజనేయ స్వామి ఆలయానికి ఆదివారం ఉదయం పూజారులు వచ్చారు. ఆలయ గేటు తాళం ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించారు. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలిపి వారి ఆధ్వర్యంలో పరిశీలించారు. శనివారం అర్ధ రాత్రి గుర్తు తెలియని దుండగులు గేటు తాళాన్ని పగుల గొట్టి లోనికి ప్రవేశించి ఉంటారని తెలిపారు. ప్రధాన ఆలయంలోని సాయినాథుడి గుడి తలుపులు పగుల గొట్టి ఉండడాన్ని గుర్తించారు. ఈ విషయమై ఇన్‌స్పెక్టర్ రామయ్యను వివరణ కోరగా.. దుండగులు ఆలయంలో చోరీకి యత్నించే సమయంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం రాకను గమనించి పారిపోయి ఉంటారని తెలిపారు.

పథకాలకు ఆకర్శితులై బీఆర్ఎస్‌లో చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సూచించారు. నియోజకవర్గ పరిధిలోని మహ్మదాబాద్ మండల పరిధిలోని పలువురు నాయకులు ఆదివారం పలు పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఇతర పార్టీలో నుంచి వచ్చిన కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశ ప్రజలకు అందించాలనే లక్ష్యంతోనే సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాలపై దృష్టి సారించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు గిరి ప్రదక్షిణ

కుల్కచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో ఉన్న పాంబండ దేవస్థానంలో ఈ నెల 7న గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు హిందూ పరిరక్షణ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రామలింగేశ్వర దేవస్థాన పరిధిలో ప్రతీ పౌర్ణమిన సాయత్రం 4.30గంటలకు పాంబండ ఆలయ పరిసర ప్రాంతాలైన గుట్ట ప్రాంతం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహిస్తారని చెప్పారు.



పాంబండ రామలింగేశ్వరాలయం

అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపుదాం

ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి



మహిళతో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి

తలకొండపల్లి: బీఆర్ఎస్ హయాంలో అవినీతి హెచ్చుమీరిందని, ఈ ప్రభుత్వాన్ని సాగనంపుదామని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జూలపల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎనిమిదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందని ఆరోపించారు. మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న బీఆర్ఎస్ నేతలు ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో అరాచక పాలన కొనసాగుతుందని, ఈ పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించకుండా సీఎం కేసీఆర్ తన కుటుంబంలో ఉన్న వారందరికీ ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన సమయంలో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ సీఎం కేసీఆర్ హయాంలో అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలను విస్మరించాయని ఆరోపించారు. దేశం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని, రైతులు అప్పులతో బాధపడుతున్నారని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి సామాన్య ప్రజలు బతకలేని స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్య గుప్తా, సోషల్ మీడియా అసెంబ్లీ ఇన్‌చార్జ్ అజీం, అసెంబ్లీ కార్యదర్శి రవీందర్ యాదవ్, సేవాదళ్ అధ్యక్షుడు దశరథం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిక్యానాయక్, నాయకులు యాట నర్సింహ, డిగ్రీ కృష్ణయ్య, చెన్నకేశవులు, ఆరీఫ్, తిరుపతి, ప్రవీణ్, మురళి, వినోదు, అభిషేక్, వెంకటయ్య, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.